

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. - 8లో..



పథకాలను వివరించండి

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి ప్రతి ఇంటికెళ్లి ప్రతి కుటుంబానికి వివరించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38.3/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఏపీ ప్రభుత్వం 2023 సంవత్సరానికి వైఎస్సార్ పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు కనీసం 10 సంవత్సరాలకుపైగా విశేష సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలకు ఈ పురస్కారాలు అందించి నగదు ప్రోత్సాహకాలు, ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత గల సంస్థల నిర్వాహకులు పేర్లు, చిరునామా, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీతో ఒక పేజీకి మించకుండా తమ సంస్థ అందించిన విశిష్ట కార్యక్రమాలను తెలియజేస్తూ తగు ఆధారాలను జతచేసి స్టెప్ సీఈఓ, ఒంగోలు వారికి పంపించాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆధారపత్రాలు మూడు కాపీలను ఈ నెల 9వ తేదీలోగా ఒంగోలులోని ప్రకాశం భవనం ఎదురుగా గల ప్రభుత్వ భవనాల సముదాయంలోని స్టెప్ సీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మొబైల్ నంబర్ 9182891095ను కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

ఉత్సాహంగా పులివెందుల అకాడమీ సెలక్షన్స్



హాకీలో నైపుణ్యాలు ప్రదర్శించిన క్రీడాకారులు

ఒంగోలు: పులివెందుల అకాడమీ సెలక్షన్స్ స్థానిక మినీ స్టేడియంలో గురువారం ఉత్సాహంగా సాగాయి. నూతనంగా నిర్మించిన పులివెందుల అకాడమీలో ప్రవేశాల కోసం జిల్లాస్థాయిలో 12 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసు గల క్రీడాకారులను ఆహ్వానించారు. వారికి హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడాంశాలలో ఉన్న నైపుణ్యాలను స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు, జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి గుంటి రాజరాజేశ్వరి పరిశీలించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభ చూపాల్సి ఉంటుందన్నారు. అక్కడ ఎంపికైన వారికి పులివెందుల అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణు, కె.చెన్నారావు, పీఈటీలు టి.రవి, హాకీ కోచ్ వెంకట్, వై.పాలెం గిరిజన స్పోర్ట్స్ స్కూల్ కోచ్ జి.అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌజ్ కేటగిరీ బదిలీలు ప్రారంభం



మహిళా కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్పీ

ఒంగోలు సబర్బన్: మహిళా పోలీసులకు ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌజ్ కేటగిరీలో బదిలీల ప్రక్రియను ఎస్పీ మలికాగర్గ్ గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులకు ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌజ్ కేటగిరీలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియను ప్రారంభించామన్నారు.

ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని మార్చాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కె.పల్లెపాలెం ప్రజలు సానుకూలంగా లేనందున పాదర్తి రెవెన్యూ పరిధిలోని భూములకు దాన్ని మార్చాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్థానిక తహసీల్దార్ బీవీ రమణారావును ఆదేశించారు. గురువారం కె.పల్లెపాలెన్ని కలెక్టర్ సందర్శించారు. ఫిషింగ్ హార్బర్ గతంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాదర్తి గ్రామంలో అందుబాటులో ఉన్న భూమిని గుర్తించి ప్రతిపాదనలు రూపొందించి ఫిషింగ్ హార్బర్ ఇంజినీర్లకు పంపించాలన్నారు. ఇక్కడ భూముల లభ్యతపై మ్యాప్‌ను పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. రూ.400 కోట్ల ప్రాజెక్టు నిధులు వెనక్కు పోకుండా కాపాడుకోవాలని, ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుకు బాసట

గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థికంగా కూడా చేయూతనిచ్చేందుకు సహకార బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించి జిల్లా పశుసంవర్ధకశాఖ రైతులకు అవగాహన కార్యక్రమాలు, రుణమేళాలు నిర్వహించింది. మొత్తం 3,513 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది.



- జిల్లా సహకార బ్యాంకు ద్వారా రుణాలు
- ఇప్పటికే 20 మండలాల్లోని 178 గ్రామాల్లో రుణమేళాలు
- స్వల్పకాలిక రుణం కోసం 731 మంది, దీర్ఘకాలికకు 2,782 మంది దరఖాస్తులు
- పీడీసీసీ బ్యాంకుల ద్వారా దరఖాస్తుల పరిశీలన



కొత్తపట్నంలో రుణమేళా నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు (ఫైల్)

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం తర్వాత రెండోది పాడి పరిశ్రమ. పాడి పరిశ్రమను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తోంది. రైతుకు గిటుబాటు ధర కల్పించేందుకు ప్రతి పంచాయతీలో అమూల్ పాల కేంద్రాలను ప్రారంభించింది. ఎక్కువ ఆదాయం వచ్చేలా వెన్నశాతాన్ని బట్టి ధర చెల్లిస్తోంది. గత్యంతరం లేక ప్రైవేటు డెయిరీలు సైతం అదే ధర అమలు చేస్తున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్నిరకాలుగా అండదండలిస్తున్న ప్రభుత్వం.. వారికి ఆర్థికంగా మరింత వెన్నుదన్నుగా నిలిచి పారిశ్రామికులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గ్రామాల్లో రుణమేళా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లాలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అవగాహన, రుణమేళా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

3,513 మంది దరఖాస్తు...

జిల్లాలోని 20 మండలాల్లో 178 గ్రామాల్లో రుణమేళాలు జరిగాయి. వాటిలో 3,513 మంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. స్వల్పకాలిక లోన్ల కోసం 731 మంది, దీర్ఘకాలిక రుణాల కోసం 2,782 మంది నుంచి దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ రుణాలిచ్చేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు పీడీసీసీ బ్యాంక్‌కు జాబితా పంపించారు. పరిశీలించి ఒక్కోటిగా బ్యాంక్ నుంచి రుణాలు ఇవ్వనున్నారు. బ్యాంక్‌లో లావాదేవీలను బట్టి ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందజేస్తారు. స్వల్పకాలిక రుణాలకు 7 శాతం వడ్డీ, దీర్ఘకాలిక రుణాలకు 11 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. దీని ద్వారా రైతులకు వడ్డీ భారం తగ్గి లాభం చేకూరుతుంది. ఇదిలా ఉండగా జిల్లాలో 249 అమూల్ పాల కేంద్రాలు ఉన్నాయి. గతంలో లీటరు పాల ధర రూ.58 ఉంటే అమూల్ పాల కేంద్రాలు వచ్చిన తర్వాత రూ.88కి పెరిగింది. దీంతో ప్రైవేటు కేంద్రాల్లో కూడా ఇదే ధర ఇస్తున్నారు. 200 లీటర్లు దాటితే లీటరుకు రూ.2.25 అదనంగా చెల్లిస్తారు.

టీడీపీ ప్రభుత్వంలో సహకారం కరువు...

టీడీపీ ప్రభుత్వంలో ఎటువంటి సదుపాయాలు లేక పోవడంతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో పాడి రైతులు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని రకాలుగా ఆర్థికంగా అండగా నిలిచారు.

178 గ్రామాల్లో రుణ మేళాలు

రుణ సదుపాయం లేని పేద పాడి రైతులను గుర్తించి వారికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు బ్యాంక్ నుంచి రుణం మంజూరు చేయిస్తాం. ఆ మొత్తాన్ని తిరిగి ప్రతి నెలా బ్యాంక్‌లో జమ చేస్తే వారికి మళ్లీ రుణం ఇచ్చే వెసులుబాటు కల్పిస్తాం. ఇప్పటికే 3,513 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. ఆ జాబితాను పీడీసీసీబీకి పంపించాం. విచారించి వెంటనే లోన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– బేబీరాణి, జేడీ, జిల్లా పశుసంవర్ధకశాఖ

గేదెలపైనే ఆధారపడి జీవిస్తున్నాం



గేదెలు మేపుకుని జీవనం సాగిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మా బతుకులు మారాయి. ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఇటీవల మా ప్రాంతంలో రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పాడి రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుంది.

– గుర్రం ధనలక్ష్మి, బీరంగుంట, కొత్తపట్నం మండలం

గ్రామానికి వచ్చి రుణం మంజూరు చేస్తున్నారు



ఇటువంటి రుణమేళాలు ఎప్పుడూ చూడలేదు. మా గ్రామానికి వచ్చి మాకు రుణం ఇవ్వడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలా చూడలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఇటువంటి లోన్లు చూస్తున్నాం. ఆర్థికంగా ఎదగడానికి రుణమేళా ఎంతో ఉపయోగపడుతుంది.

– మద్దా అంజమ్మ, బీరంగుంట

జగనన్న పథకాలతో ఆర్థికాభివృద్ధి

- క్షేత్రస్థాయిలో పథకాల అమలును పరిశీలించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు, ఇతర పథకాలతో రాష్ట్రంలోని పేద ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయా పథకాలన్నీ క్షేత్రస్థాయిలో అర్హులందరికీ అందుతున్నాయో..లేదో తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఒంగోలు మండలంలోని పెద్దదేవరంపాడు గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ ముఖద్వారం వద్ద భారీ సంఖ్యలో మహిళలు పూలమాలలు వేసి హారతులిచ్చి బాలినేనికి ఘనంగా స్వాగతం పలికారు. జై జగన్, జై బాలినేని, జై వైఎస్సార్ సీపీ అనే నినాదాలు మార్మోగాయి. అనంతరం పెద్దదేవరంపాడులో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను ఎమ్మెల్యే బాలినేని సందర్శించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆయనకు తెలియజేయగా, మండల, డివిజన్‌స్థాయి అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. గృహాల మధ్య రోడ్డు ఆక్రమించి నిర్మించిన ఇంటికి సంబంధించిన వారికి నోటీసులు జారీ చేయాలని వీఆర్వో జగదీష్‌బాబును ఎమ్మెల్యే ఆదేశించారు. గౌరైలమంద అపహరణపై ఓ మహిళ ఫిర్యాదు చేయగా, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డితో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ శివారులోని తమ గృహానికి విద్యుత్ సదుపాయం కల్పించాలని ఓ కుటుంబం కోరగా, తక్షణమే స్పందించి కరెంటు కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వృద్ధులకు ఆర్థికసాయం అందజేశారు. దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న మరో ఇద్దరు పురుషులకు తక్షణ వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించి ఆర్థిక అవసరాలకు నగదు అందించారు. పూరిపాకల్లో ఉంటున్న పలువురికి తక్షణమే పక్కా గృహాలు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, ఏఈ పృథ్వీ, కార్యదర్శి స్వప్నను ఎమ్మెల్యే బాలినేని ఆదేశించారు. సముద్రతీర ప్రాంతంలో ఉంటున్న వారి పూరిపాకలను పక్కా గృహాలుగా మార్చాలని స్పష్టం చేశారు. పూరిపాకలకు తక్షణ మరమ్మతుల నిమిత్తం తాటాకు, బొంగులు కొనుగోలు చేసుకునేందుకు వారికి ఆర్థికసాయం అందజేశారు.

ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ అందరిలా తూతూమంత్రంగా గ్రామాలను సందర్శించకుండా ప్రతి గృహంలో ప్రతి కుటుంబంతో మాట్లాడి జగనన్న పథకాలు అందని వారుంటే వెంటనే అందించేందుకు, ఇతర సమస్యలు కూడా పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులై ఉండి పథకాలు అందని వారు ఉంటే అక్కడికక్కడే మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. తాము ఎలాంటి లబ్ధి పొందలేదని భవిష్యత్తులో ఎవరూ అనకూడదనే ఉద్దేశంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆటో బోల్తాపడి తీవ్రంగా గాయపడిన బాలికకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేస్తామని, ఇంటర్ నుంచి తానే చదివిస్తానని తెలిపారు. అనంతరం రెండో విడత నాడు-నేడులో భాగంగా నిర్మిస్తున్న పాఠశాలలను సందర్శించి ప్రస్తుతం విడుదలైన రూ.10 లక్షలకు మరో రూ.4 లక్షలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం రూ.14 లక్షలతో పనులు పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు వాకా బసివిరెడ్డి, ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కటారి శంకర్, చుండూరి రవిబాబు, సచివాలయాల కన్వీనర్ సోమశేఖర్, సర్పంచ్ నాయుడుశ్రీరాములు, గుండాయపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు పేతురు, బాబు, ఒంగోలు నగరపాలక సంస్థ నాయకులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల ఉసురు తగులుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు

- బ్రాహ్మణ సమాజానికి స్థలం కేటాయిస్తే స్వార్థ ప్రయోజనాలని అంటారా.?
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేస్తే 6.50 సెంట్లు కేటాయించారు
- తద్దినాల కోసం కేటాయిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు
- అలాంటి అంశంపై ఆంధ్రజ్యోతి పత్రికలో అడ్డగోలు రాతలా.?
- విలేకరుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన బ్రాహ్మణ సమాజం
- బ్రాహ్మణుల పక్షపాతి బాలినేని అంటూ కితాబు

ఒంగోలు సబర్బన్: బ్రాహ్మణుల విషయంలో అబద్ధపు రాతలు, అసత్య ప్రచారాలు చేస్తే వారి ఉసురు కొడుతుందని ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి నాయకులు శాపనార్థాలు పెట్టారు. స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, బ్రాహ్మణ సమాజ ప్రముఖులు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి పత్రికపై ధ్వజమెత్తారు. బ్రాహ్మణ సమాజం కోసం కేటాయించిన స్థలం విషయంలో ఆంధ్రజ్యోతి పత్రిక అబద్ధపు అతస్య కథనం రాసిందని మండిపడ్డారు. బ్రాహ్మణ సమాజం కోసం ఒంగోలు నగరంలో స్థలం కేటాయించడానికి నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో తీర్మానం చేస్తే స్వార్థ ప్రయోజనాల కోసం అని అబద్ధపు రాతలు రాయడం ఆంధ్రజ్యోతి పత్రికకు సబబు కాదన్నారు. బ్రాహ్మణ సమాజం పడుతున్న అవస్థలను గుర్తించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తోపులో బడిలో 6.50 సెంట్ల స్థలం కేటాయిస్తూ మంగళవారం జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయించారన్నారు. దానిపై బ్రాహ్మణులకు వ్యక్తిగత ప్రయోజనాల కోసం రూ.10 కోట్ల విలువైన స్థలం కేటాయించారంటూ అసత్య కథనాలు రాశారని ధ్వజమెత్తారు. 2,600 చదరపు అడుగుల స్థలం రూ.10 కోట్ల ధర పలుకుతుందా అని ఆ పత్రికను నిలదీశారు. బ్రాహ్మణులు ఎన్నో దానాలు చేశారని, ఎన్నో భూములను కూడా దానం చేశారని తెలిపారు. కానీ, ఒంగోలులో బ్రాహ్మణులు తద్దినాలు పెట్టుకోవడానికి సరైన వసతులు లేక ఇబ్బందిపడుతున్నారని బాలినేని దృష్టికి తీసుకెళ్తే స్థలం కేటాయించి మంచి మనసును చాటుకున్నారని కొనియాడారు. ఈ విషయంపై విషం కక్కడం మంచి పద్ధతి కాదన్నారు. పితృ కార్యాలు బ్రాహ్మణులే చేసుకోకపోతే ఇతర కులాల వారికి ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. బ్రాహ్మణుల ఆగ్రహానికి గురికావద్దంటూ శాపనార్థాలు పెట్టారు. విలేకరుల సమావేశంలో బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సీవీఎల్ సుబ్రహ్మణ్యం, శ్రీరంగనాథప్రసాదు, మతంపల్లి దక్షిణామూర్తి, బ్రాహ్మణ పెద్దలు నేలబట్ల సదాశివయ్య, మైనంపాటి సాయికుమార్, ఉప్పుగుండూరి శ్రీనివాసరావు, పింగళిపూర్ణ చంద్రరావు, ముక్తినూతలపాటి వాసు, మద్దులూరి హరిప్రేమనాథ్, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజాశంకర్ శాండిల్య, నీలంరాజు సరోజ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు తిరుగులేదు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

- రాష్ట్రంలో ఎదురులేని శక్తిగా మారిన వైఎస్సార్ సీపీ
- ప్రజలను సొంత కుటుంబంలా చూసుకుంటున్న జగనన్న
- సీఎం పరిపాలనపై గ్రామాల్లో సైతం హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుగులేని నేతగా చరిత్ర సృష్టించారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. దర్శి మండలంలోని బసిరెడ్డిపల్లె గ్రామంలో సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా హాజరైన బూచేపల్లి వెంకాయమ్మకు ఘనంగా స్వాగతం పలుకుతూ రెండు కిలోమీటర్ల పొడవున భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. డప్పు వాయిద్యాలు, దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ ప్రజలతో బూచేపల్లి వెంకాయమ్మ ఆప్యాయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపారు. ముందుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆయా వైద్య విభాగాలను పరిశీలించారు. టెస్ట్‌లు, మందులు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సొంత కుటుంబంలా చూసుకుంటూ పరిపాలన సాగించిన వారిలో ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒకరైతే.. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొకరని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎదురులేని శక్తిగా వైఎస్సార్ సీపీ మారిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదల పాలిట వరాలుగా మారాయన్నారు. ప్రజలందరికీ ఉన్నత వైద్యం అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఇక్కడ తగ్గని జబ్బులకు పెద్దాస్పత్రులకు తీసుకెళ్లి ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరించి వ్యాధులు నయమయ్యేంత వరకు అండగా ఉండటం అభినందనీయమని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లు సాధించి తీరుతామని జెడ్పీ చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. బసిరెడ్డిపల్లె గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్ గోడకు జెడ్పీ నిధుల ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేశారు. తాగునీరు, రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అఫీషియల్ స్పోక్స్‌పర్సన్ డాక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ సర్పంచ్‌లు ఉడుముల వెంకటరెడ్డి, చంద్రగిరి గురవారెడ్డి, నలదిమ్ము రమణారెడ్డి, వైద్యులు కిరణ్మయి, యాతం సురేఖ, ఎంపీడీఓ కుసుమకుమారి, డీటీ రవిశంకర్, నాయకులు శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లపాలెం తీరంలో సోనాబోట్ల హల్‌చల్



ఊళ్లపాలెం తీరానికి దగ్గర్లో చేపల వేట సాగిస్తున్న సోనాబోట్లు

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం సముద్ర తీరంలో గురువారం సాయంత్రం సోనాబోట్లు హల్‌చల్ చేశాయి. కొన్ని రోజులుగా చేపల వేటకు విరామం ఇచ్చిన తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన సోనాబోట్లు.. ప్రస్తుతం మళ్లీ విజృంభించాయి. గతంలో 8 నుంచి 9 బోట్లు వస్తుండగా, ఈసారి ఏకంగా 13 బోట్ల వరకు వేటకు వచ్చినట్లు ఊళ్లపాలెం మత్స్యకారులు తెలిపారు. ఈసారి కూడా తీరప్రాంత నిబంధనలకు వ్యతిరేకంగా తీరానికి దగ్గరలో పర్లాంగు దూరంలో సోనాబోట్లు చేపల వేట సాగించాయి. వాస్తవానికి తీరానికి 8 కిలోమీటర్ల అవతల చేపల వేట సాగించాల్సి ఉందని మత్స్యకారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించడం వలన లక్షలాది రూపాయల వలలు ధ్వంసం కావడమే కాకుండా మత్స్యసంపద మొత్తం ఎత్తుకెళ్తున్నారని స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సోనాబోట్లను అడ్డుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై పాకల పోతయ్యగారి పట్టపుపాలెంలో మత్స్యకారుల సమక్షంలో మత్స్యశాఖ, మెరైన్, స్థానిక పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సోనాబోటు కొనుగోలు చేయాలని, అందుకు నిధులు సమీకరిద్దామని, మత్స్యకారులు కూడా వారి వంతు సహాయం అందించాలని వరికూటి కోరారు. ప్రస్తుతం ఆ ప్రయత్నాలు జరుగుతుండగానే తీరంలో సోనాబోట్లు హల్‌చల్ చేయడంతో వాటిని కట్టడి చేసే ప్రయత్నాలను వేగవంతం చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మైనంపాడు బాలికలు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన బాలికలు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ టీ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో మైనంపాడు విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అండర్-14 విభాగంలో సంజన, శ్రీలక్ష్మి, డోర్కా, ఆసిఫా, అండర్-17 విభాగంలో వర్షిత, వసంత, జుబేరియా ఎంపికై నట్లు వివరించారు. వారిని హెచ్ఎం, టీచర్లు, స్కూల్ కమిటీ సభ్యులు అభినందించారు.

క్లుప్తంగా

మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక చర్యలు

- డీఎస్పీలతో సమీక్షలో ఎస్పీ మలికాగర్గ్



డీఎస్పీలతో మాట్లాడుతున్న ఎస్పీ

ఒంగోలు సబర్బన్: మిస్సింగ్ కేసుల ఛేదన కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. జిల్లాలోని డీఎస్పీలతో ఆమె ఛాంబర్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కనిపించకుండా పోయిన వారి ఆచూకీ కనుగొనేందుకు ఆధునాతన సాంకేతిక విధానాలు సరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, వాటి దర్యాప్తులో అలసత్వం వహించరాదన్నారు. కేసుల విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. చిట్‌ఫండ్ చీటింగ్, భౌతిక దాడులకు సంబంధించి కేసుల విషయంలో కూడా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కేసుల దర్యాప్తు రించి వాకబు చేశారు. సమీక్షలో ఎస్పీ(అడ్మిన్)కే.నాగేశ్వరరావుతో పాటు జిల్లాలోని డిఎస్పీలు పాల్గొన్నారు.

మంత్రి మేరుగ నాగార్జున ప్రత్యేక పూజలు



ఆలయాల్లో పూజల్లో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున

త్రిపురాంతకం: మండలంలోని బాలాత్రిపుర సుందరీదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద ఆయనకు పండితులు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. త్రిపురాంతకం బాలాత్రిపురసుందీదేవికి కుంకుమార్చనలు, పార్వతి త్రిపురాంతకేశ్వరస్వామికి అభిషేకం, చిన్న మస్తాదేవికి ప్రత్యేక పూజలను మంత్రి నాగార్జునతో పండితులు విశ్వనారాయణశాస్త్రి, ప్రసాదశర్మలు జరిపించారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పండితులు ఆశీర్వచనం అందించారు. ఈయన వెంట గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల వెంకట పిచ్చయ్య, ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు మల్లికార్జున్, అన్నమ్మ లింగయ్య, పార్టీ కో కన్వీనర్ యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళల, జూనియర్ బాలుర జిల్లా జట్ల ఎంపిక ఈనెల 7న స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నరశింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన బాలురు జూనియర్ విభాగంలో పాల్గొనేందుకు అర్హులు. ఆసక్తి ఉన్న వారు తమ వయసు ధ్రువీకరణ పత్రంతో సాయంత్రం 3 గంటలకు ఎంపిక ప్రదేశంలో హాజరు కావాలని కోరారు.

తేలు కుట్టి విద్యార్థి మృతి



మృతిచెందిన రవికిరణ్ (ఫైల్)

మార్కాపురం రూరల్: తేలు కుట్టి విద్యార్థి మృతి చెందిన సంఘటన మార్కాపురం మండలంలోని రాయవరం జెడ్పీ హైస్కూల్లో చోటుచేసుకుంది. మార్కాపురం మండలంలోని నాయుడుపల్లి ఎస్సీకాలనీకి చెందిన కోట్ల రవికిరణ్ (14) రాయవరం జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం పాఠశాల అయిపోయిన తర్వాత స్టడీ అవర్‌లో కూర్చున్నాడు. పుస్తకాలు తీసే క్రమంలో బ్యాగ్‌లో చేయిపెట్టగా, బ్యాగ్‌లో ఉన్న తేలు రవికిరణ్‌కు కుట్టింది. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం తోట రామకృష్ణ, తల్లిదండ్రులు మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కోట్ల రామకోటేశ్వరరావు, కొండమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు కాగా, రవికిరణ్ చివరి వాడు. కోటేశ్వరరావు పాస్టర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న బాలినేని

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

అల్లూరు (కొత్తపట్నం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు సచివాలయం-2లో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. హెల్త్ క్లినిక్ల ఏర్పాటు, నెలలో రెండు సార్లు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్లతో వైద్య శిబిరాలు నిర్వహించడం వంటివి చేస్తున్నామన్నారు. ఇంకా మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఇంటికి తిరిగి సర్వే చేసి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పరీక్షించి మందులు అందజేస్తున్నామని తెలిపారు. ఎవరికైనా ఆపరేషన్లు చేయాల్సి వస్తే కార్పొరేట్ వైద్యశాలలలో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేస్తామని తెలిపారు. ఆరోగ్యపరంగా ఎవరికి ఎటువంటి ఇబ్బంది రాకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. సచివాలయ-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిందని, త్వరలో సచివాలయం-2 పరిధిలో ప్రారంభిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అల్లూరు గ్రామానికే రూ.100 కోట్ల సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందాయన్నారు. 15 రోజుల పాటు ఇంటింటికి సర్వే చేసి పరీక్షలు చేసిన ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌వోలు) బత్తల భారతి, త్రినాథ్, ఏఎన్ఎంలు కె.సుభాషిణి, ప్రియాంకలను బాలినేని సన్మానించారు. తరువాత ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. రూ.5 లక్షల విలువైన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. తొలుత ఒక్కో కౌంటర్‌ను పరిశీలించి వైద్యులు, రోగులతో మాట్లాడారు. సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ మిట్నసల శాంతారావు, మండల ప్రత్యేకాధికారి అర్చన, ఎంపీడీఓ పి.సుజాత, ఈఓఆర్డీ ఏ.బాలచెన్నయ్య, కో ఆప్షన్ సభ్యుడు బాజీ, డాక్టర్ హేమంత్ కుమార్, ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కూచిపూడి శరత్, సీనియర్ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, డాక్టర్ శివపార్వతి పాల్గొన్నారు.

పథకాలను ప్రతి ఇంటికి వివరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఇంటికీ తిరిగి వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రతి గడపకు చేరాయని, అందువల్ల ఓటు వేయండని అడిగే హక్కు మనకు ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాలకే లక్షల కోట్ల రూపాయలను జమ చేసి వారు ఆర్థికంగా బలపడేలా చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం సంక్షేమం గురించి పట్టించుకోకుండా ప్రజాధనాన్ని ఏ విధంగా లూటీ చేసిందో కూడా వివరించాలన్నారు. ఆర్థిక నేరాలు చేసి సాక్ష్యాలతో సహా దొరికిపోయిన చంద్రబాబును జైలులో పెడితే దాన్ని కూడా టీడీపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు అవినీతి చేసి జైలుకు వెళ్లారని, చంద్రబాబు వారి కంటే అతీతుడా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పనంగా దోచుకుతిన్న దొంగ చంద్రబాబు అని, ఆయన కుమారుడు లోకేష్ కూడా అదే మార్గంలో ప్రయాణిస్తున్నాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ప్రజలు భూ స్థాపితం చేస్తారని స్పష్టం చేశారు. పార్టీని మరోమారు భారీ మెజారిటీతో గెలిపిండానికి ప్రతి ఒక్క పార్టీ నాయకుడు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కృషి చేయాలని కోరారు. ముందుగా మండల నాయకులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో, రెండేళ్ల క్రితం జరిగిన సంస్థాగత ఎన్నికల్లో టీడీపీ చావు దెబ్బతిందన్నారు. మనమంతా సమష్టిగా ముందుకు సాగి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోమారు భారీ మెజారిటీతో అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం రానున్న ఎన్నికల్లో వ్యవహరించాల్సిన విధానాల గురించి వివరించారు. తొలుత మద్దిపాడు జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి అకాల మృతికి నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి , సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, గుడ్డ పాతల రవి, సంజీవరావు వీరారెడ్డి లింగారామకృష్ణారెడ్డి, పోతినేని శ్రీనివాసరావు, తేళ్ల పుల్లారావు, మద్దా లక్ష్మీనారాయణ, సన్నపురెడ్డి రమణమ్మ, బెజవాడ రాము, ప్రసన్న షేక్‌బాబు పైడిపాటి వెంకట్రావు, రాయపాటి రమేష్, నారా సుబ్బారెడ్డి, కొమ్మూరి సుధాకర్, బాల చంద్రమౌళి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ఆరోగ్య సురక్ష లక్ష్యం

- ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి యాదాల అశోక్‌బాబు



వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న యాదాల అశోక్‌బాబు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి యాదాల అశోక్‌బాబు అన్నారు. గురువారం ఆయన వెంగముక్కలపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డబ్బులు లేని కారణంగా పేద ప్రజలెవ్వరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే ఉచితంగా చికిత్స అందించే ఏర్పాటు చేశారన్నారు. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే రూ.8 వేలు ఖర్చయ్యే వైద్య పరీక్షలు, ఇతర చికిత్సలు ఇప్పుడు ఉచితంగా చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారని కొనియాడారు. మోకాళ్లనొప్పులు, గుండె సమస్యలు, కిడ్నీ చికిత్సలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. చికిత్సలో భాగంగా రోగులకు నాణ్యమైన కంపెనీ మందులను ఇస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల పాటు నిర్వహించే శిబిరాల్లో అవసరమైన వారికి కార్పొరేట్ వైద్యశాలల్లో శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి వెంటనే కంటి అద్దాలు ఇస్తారని, అవసరమైతే కంటికి ఆపరేషన్లు చేయిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా క్యాంపునకు రోగులను తీసుకు వస్తున్న దివ్యాంగుడైన వలంటీర్‌ను అభినందించారు. అదే విధంగా నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ యాదాల రత్నభారతితో కలిసి యాదాల అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఏఆర్ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- ఎస్పీ మలికాగర్గ్



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: ఏఆర్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం ఏఆర్ సిబ్బందికి ప్రత్యేకంగా మాస్టర్ హెల్త్ చెకప్‌లు చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమంపై ప్రధానంగా దృష్టి సారించి వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి బృందంతో ప్రత్యేకంగా పరీక్షలు చేయించారు. ఏఆర్ సిబ్బంది కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. క్రమం తప్పకుండా వ్యాయామం అవసరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఓ ఎం.సులోచన, ఆర్ఐ శ్రీహరి రెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

భగీరథ ఫ్యాక్టరీతో ఎన్నో అవస్థలు

- రెండేళ్లలో తరలిస్తామని యాజమాన్యం మాట తప్పింది
- ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో అడ్డగోలు రాతలు
- యాజమాన్యం వద్ద ఏం ఆశించి రాతలు రాస్తున్నారో వారికే తెలియాలి
- ప్రజల కష్టాలు ఎల్లో మీడియాకు పట్టవంటూ ధ్వజం
- బ్రాహ్మణుల కార్యక్రమాలకు స్థలం కేటాయిస్తే దానిపైనా ఏడుపులా
- కార్పొరేటర్లతో కలిసి ధ్వజమెత్తిన నగర మేయర్ గంగాడ సుజాత



మాట్లాడుతున్న నగర మేయర్ గంగాడ సుజాత, పక్కన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

ఒంగోలు సబర్బన్: భగీరథ ఫ్యాక్టరీతో చుట్టుపక్కల ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాలులో గురువారం పలువురు కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో భగీరథ కెమికల్ ఫ్యాక్టరీని అక్కడ నుంచి తరలించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ప్రపంచంలో నిషేధిత కెమికల్స్‌ను ఒంగోలులోని భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ తయారు చేస్తుందన్నారు. ఈ కెమికల్స్ వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఏబీఎన్, ఆంధ్రజ్యోతి మీడియాలో మాత్రం భగీరథ ఫ్యాక్టరీ తరలిస్తే ప్రజలకు ఉపాధి కోల్పోతున్నారని అడ్డగోలు రాతలు రాశారని ధ్వజమెత్తారు. ఏం ఆశించి ఇలాంటి రాతలు రాస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆ మీడియాకు ఒంగోలు ప్రజల ఇబ్బందులు పట్టవా అంటూ నిలదీశారు. 2021లో ఫ్యాక్టరీ రెన్యువల్ సమయంలోనే రెండేళ్లలో విడతల వారీగా తరలిస్తామని అప్పట్లో మంత్రిగా ఉన్న బాలినేనికి ఫ్యాక్టరీ యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఆ హామీని యాజమాన్యం విస్మరించిందన్నారు. అయితే అవేమీ పట్టించుకోకుండా ఆంధ్రజ్యోతి పత్రిక తన రాతలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. నిషేధిత కెమికల్స్ ప్రభావంతో ప్రజలకు అంగవైకల్యంతో పాటు కాన్పులు కూడా సజావుగా కావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుంటే దాని గురించి ఎల్లో మీడియాకు పట్టదని ధ్వజమెత్తారు. బ్రాహ్మణులు తద్దినాలు పెట్టుకునేందుకు తోపులో బడిలో స్థలం కేటాయిస్తే దానిపై కూడా ఏడుపుగొట్టు రాతలు రాయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. బ్రాహ్మణులు ఉసురుపోసుకుంటారని శాపనార్థాలు పెట్టారు. డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు మాట్లాడుతూ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు క్విస్ కాలేజీకి ఎదురుగా విల్లాలు నిర్మించుకుంటుంటే అందుకోసం భగీరథ కెమికల్ ఫ్యాక్టరీని తరలిస్తున్నారని అబద్ధ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఆ స్థలాన్ని కొన్నేళ్ల క్రితమే కొనుగోలు చేసి అభివృద్ధి కోసం పెట్టుకుంటే ఈ అసత్య ప్రచారాలుచేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కొత్తగా ఒంగోలు నగరంలోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇచ్చే 25 వేల ఇళ్ల పట్టాలు చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కలపాలెం సమీపంలో ఇస్తున్నారన్నారు. ఇప్పటికే పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఈ ఫ్యాక్టరీ వల్ల భూగర్భ జలాలు కలుషితం అయ్యాయని, పెరుగుతున్న నగరాన్ని దృష్టిలో పెట్టుకొని ఫ్యాక్టరీని అక్కడ నుంచి తరలించాలని కౌన్సిల్‌లో తీర్మానించామన్నారు. తీర్మానంలో టీడీపీ సభ్యులు కూడా అంగీకరించారని గుర్తు చేశారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అంగీకారంతో కౌన్సిల్‌లో తీర్మానం చేస్తే ఆంధ్రజ్యోతి పత్రిక దండగమారి రాతలు రాయటం సిగ్గుచేటన్నారు. బ్రాహ్మణ సమాజంపై ఆంధ్రజ్యోతి పత్రిక కక్ష కట్టిందని ధ్వజమెత్తారు. సమావేశంలో 15వ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్ మాట్లాడారు.

పశుపోషకులకు మెరుగైన సేవలందించాలి

- పశుసంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ వెంకటరావు



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ వెంకటరావు

ఒంగోలు సెంట్రల్: పశుపోషకులకు మెరుగైన సేవలందించాలని జిల్లా ప్రత్యేకాధికారి, పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ వెంకటరావు అన్నారు. జిల్లా డీఎల్‌ఏ సమావేశ మందిరంలో గురువారం సహాయ సంచాలకులు, పశువైద్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్, జిల్లా పశుసంవర్ధక శాఖ ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ పశువిజ్ఞాన బడి లక్ష్యాలను పూర్తిగా సాధించేలా కృషి చేయాలని కోరారు. అందిస్తున్న సేవలు, ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. యర్రజర్లలో దేశీయ గోజాతి ఫాంను, పశువైద్యశాలను, కందులూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కే.బేబిరాణి మాట్లాడుతూ వైఎస్సార్ పశు బీమా పథకం జిల్లాలో అధిక మంది రైతులు లబ్ధి పొందేలా పనిచేసిన వైద్యులను సిబ్బందిని ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యేక స్థానం సంపాదించినందుకు జిల్లా బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ షేక్ కాలేషా, డాక్టర్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ సోమయ్య, సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట రామిరెడ్డి, ఒంగోలు పశువైద్యులు డాక్టర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు సిటీ: నాబార్డు ద్వారా అందే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం. ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఒంగోలులో నాబార్డు వారి ఆర్థిక సహాయంతో చేతి వృత్తుల వారికి శిక్షణలో తయారు చేసిన హ్యాండ్ బాగ్స్, జూట్ బ్యాగ్స్, వివిధ రకాల ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్‌ను ముఖ్య అతిథిగా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

యర్రగొండపాలెం: తల్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు బెంగళూరు వెళ్లిన గంజివారిపల్లె ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు(41) గుండెపోటుతో గురువారం వేకువజామున మృతి చెందారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న శ్రీనివాసరావు తల్లి శోభారాణికి మంచి వైద్యం అందించాలన్న ఉద్దేశంతో నెల రోజుల క్రితం బెంగళూరులోని ఒక వైద్యశాలలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి తెలుసుకునేందుకు మూడు రోజుల క్రితం తన విధులకు సెలవుపెట్టి బెంగళూరు వెళ్లాడు. తన తల్లి ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులతో మాట్లాడిన ఆయన తల్లి బెడ్‌ప్రక్కనే విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అనుకోకుండా తీవ్రమైన గుండెనొప్పి రావడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి



వెలగొండయ్య మృతదేహం

రాచర్ల: విద్యుదాఘాతానికి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని సంగపేట గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సోమిదేవిపల్లె పంచాయతీ పరిధిలోని సంగపేట గ్రామానికి చెందిన నాగం వెలగొండయ్య (70) అనే రైతు తన వరి పొలానికి నీరు పెట్టేందుకు మోటార్ వద్దకు వెళ్లగానే విద్యుత్ మోటార్‌కు సంబంధించిన విద్యుత్ తీగలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగం వెలగొండయ్యకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

17న వాహనాల వేలం

ఒంగోలు: పన్నులు చెల్లించకుండా తిరుగుతూ , రవాణాశాఖ అధికారుల తనిఖీలలో పట్టుబడి నిర్బంధంలో ఉన్న 11 వాహనాలకు ఈనెల 17న వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ఆర్టీసీ డిపోలో 6, చీమకుర్తి పీఎస్‌లో 3, నాగులుప్పలపాడు పోలీసుస్టేషన్‌లో 1, టంగుటూరు పోలీసుస్టేషన్‌లో ఒకటి ఉంచామన్నారు. వీటిలో గూడ్సు వాహనం 1, ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ బస్సులు 2, ఆటోరిక్షాలు 5, మాక్సీ క్యాబ్‌లు 1 , మోటారు సైకిళ్లు 2 ఉన్నాయి. సంబంధిత వాహన యజమానులు, ఫైనాన్షియర్లు, తమ వాహనాలకు చెల్లించాల్సిన పన్నులు, అపరాధరుసుం చెల్లించి ఈనెల 15వ తేదీలోగా విడుదల చేయించుకోవాలన్నారు. లేదంటే ఈనెల 17న బహిరంగ వేలం వేస్తామని తెలిపారు.